మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు?

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య

వేములవాడ, అక్టోబర్ 1: 'మున్నూరు కాపులకు నిధులెప్పుడిస్తరు? కార్పొరేషన్‌కు కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేస్తరు?' అని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని మున్నూరు కాపు నిత్యాన్నదాన సత్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ ఏర్పాటు అంశాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టినందుకే రాష్ట్రంలోని 50 లక్షల మంది కాపులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారని గుర్తుచేశారు. వంద రోజుల్లోనే కాపు కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమైనప్పటికీ.. కమిటీని ఎప్పుడు నిర్ణయిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు ఇవ్వాలని నిరసన తెలిపినా ప్రభు త్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభు త్వం కోకాపేటలో రూ. 500 కోట్ల విలువైన భూమి ఇవ్వగా, ప్రభుత్వం ఇచ్చే రూ.50 కోట్లు సరిపోవని అన్నారు.

కేయూలో విజిలెన్స్ దాడులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 1: కాకతీయ యూనివర్సిటీలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ బాలుకోటి, సీఐ రాకేశ్, ఇతర విజిలెన్స్ అధికారుల బృందం కేయూ పాలన భవనంలో విచారణ చేపట్టారు. మాజీ వీసీ తాటికొండ రమేశ్ అక్రమాలపై అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ బాధ్యులు ప్రభుత్వానికి, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం స్పందించి విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. మాజీ వీసీ రమేశ్ అక్రమాలపై అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో విజిలెన్స్ అధికారులు స్వయంగా యూనివర్సిటీకే వచ్చారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పెరటి మల్లారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుత ఇన్‌చార్జి రిజిస్ట్రార్, కంట్రోలర్ నరసింహాచారి, వర్సిటీ ఆడిట్, స్టేట్ లోకల్ ఆడిట్ వారి ఫైళ్లను పరిశీలించారు.

హోంగార్డులంటే అంత చులకనా?

- సర్కారు కూల్చివేతల్లో గాయపడితే పట్టించుకోరా?
- హోంగార్డు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- ఏఐజీ దవాఖానలో గోపాల్‌కు హరీశ్‌రావు పరామర్శ

గచ్చిబౌలి ఏఐజీలో చికిత్స పొందుతున్న హోంగార్డు గోపాల్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, చింతా ప్రభాకర్. చిత్రంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, పెద్ది సుదర్శన్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): హోంగార్డులంటే ప్రభుత్వానికి, పోలీసు ఉన్న తాధికారులకు చులకనగా ఉందా? అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్న సంగారెడ్డికి చెందిన హోంగార్డు గోపాల్‌ను మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ పోలీస్టేషన్ హోంగార్డు గోపాల్.. ఇటీవల మల్కాపూర్ పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తుండగా శిథిలాలు తగిలి తీవ్రంగా గాయపడి చికి త్స పొందుతున్నారని తెలిపారు. గోపాల్‌ను ఒక్క ఉన్నతాధికారి కూడా పరామర్శించలేదని తెలిపారు. గోపాల్ కోలుకునే వరకు వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, 4 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఇంకా మాజీ ఎమ్మెల్యేలు పెద్దరెడ్డి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ఉన్నారు.

కారు బోల్తా.. ఐదుగురి దుర్మరణం

- మృతులంతా ఒకే కుటుంబం వారు
- ఆదిలాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం

ఆదిలాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ టీచర్స్ కాలనీకి చెందిన మొహిజొద్దీన్ తన మ్యాక్స్ వాహనంలో కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా బైంసాకు వెళ్లివస్తున్నాడు. గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మొహిజొద్దీన్ (65), ఆయన అల్లుడు ఖాజా మొయినొద్దీన్ (40), మనుమలు ఉస్మాన్‌నొద్దీన్ (11), ఫరొద్దీన్ (12), మహమ్మద్ అలీ (8) మృతి చెందగా.. కారులో ప్రయాణిస్తున్న ఆయేషా, ఏక్రాలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు.

ఖమ్మం జిల్లాలో ముగ్గురు

కారేపల్లి, అక్టోబర్ 1: ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం భాగ్యనగర్‌తండా వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు మృతి చెందారు. గుట్టకిందగుంపునకు చెందిన ఉండం సూర్యనారాయణ (45), సుగుణ (42) దంపతులు బైక్‌పై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు వెళ్లి వస్తున్నారు. ఓపెన్‌కాస్ట్ సమీపంలోని సోలార్ పవర్‌ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నక్క వెంకటేశ్(35), ఆలియాతండాకు చెందిన ధరావత్ రాజు కారేపల్లి నుంచి పవర్‌ప్లాంట్ వైపు బైక్‌పై వెళ్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. సూర్యనారాయణ, సుగుణ, వెంకటేశ్ అక్కడికక్కడే మృతిచెందారు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఇల్లెందు దవాఖానకు తరలించారు.

- తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని నిరసిస్తూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలో మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. పదోవార్డు వాసులు మాట్లాడుతూ మోటర్ కాలిపోవడంతో నీళ్లు రాక అవస్థలు పడుతున్నామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమాదేవి హామీతో ఆందోళన విరమించారు. – నేరేడుచర్ల

- గుండూరు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల ధర్నా

పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గుండూరు జెడ్పీహెచ్‌ఎస్ ఎదుట మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు ధర్నా చేపట్టారు. పాఠశాలలో మూత్రశాలలు నిర్మించినా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నామని తెలిపారు. మూత్రవిసర్జన కోసం బహిరంగ ప్రదేశాలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నట్టు చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టకుండా స్థానిక ప్రజాప్రతినిధులు – కల్వకుర్తి రూరల్

- మూడ్రోజుల తర్వాత మళ్లీ మార్కింగ్

ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసరాల్లో మూడ్రోజుల తర్వాత మంగళవారం అధికారులు మళ్లీ సర్వే చేయడానికి రావడంతో స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు. – ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ

లడ్డూ వివాదంపై సిట్ దర్యాప్తు నిలిపివేత

హైదరాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం మంగళవారం సంచలన నిర్ణయం తీసుకున్నది. సిట్ దర్యాప్తును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. ప్రభుత్వ తరపు లాయర్ల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు డీజీపీ స్పష్టం చేశారు.

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

- కొంతకాలంగా అఘాయిత్యం
- 4 నెలల గర్భిణిగా తేల్చిన వైద్యులు

గీసుగొండ, అక్టోబర్ 1: వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(12)పై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ ప్రభుత్వ పాఠశాలలో బాలిక 8వ తరగతి చదువుతున్నది. ఆమెకు తండ్రి లేడు. అదే గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65) బాలికకు మాయమాటలు చెప్పి కొంతకాలంగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. బాలిక ఆరోగ్య పరిస్థితిని గమనించిన తల్లి నిలదీయగా విషయం చెప్పింది. మంగళవారం గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు బాలికకు వైద్య పరీక్షలు చేయించారు. బాలిక 4 నెలల గర్భిణిగా నిర్ధారించారు. సాంబయ్యపై పోక్సో కేసు నమోదైంది.

ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు

సత్తాచాటిన నాగర్‌కర్నూల్ జిల్లావాసులు

చారకొండ/అమ్రాబాద్, అక్టోబర్ 1 : నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఓ ఇద్దరు యువకులు ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చారకొండ మండల కేంద్రానికి చెందిన పేద కుటుంబం దొడ్ల కళమ్మ, శేఖర్‌రెడ్డి దంపతుల పెద్ద కుమారుడు నరేశ్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన పోటీ పరీక్షల్లో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. హైదరాబాద్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా పట్టుదలతో చదివి పోటీ పరీక్షలు రాయగా.. ఇటీవల హెచ్‌డబ్ల్యూవో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కాగా సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీగా, సాంఘిక శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు.

చంద్రశేఖర్

నరేశ్‌రెడ్డి

మాచారానికి చెందిన చంద్రశేఖర్..

అమ్రాబాద్ మండలం మాచారానికి చెందిన చంద్రశేఖర్ డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్‌కు సాంఘిక శాస్త్రంలో 8వ ర్యాంక్, ఎస్జీటీలో 15వ ర్యాంక్, భాషా పండిత్ తెలుగులో 3వ ర్యాంక్ సాధించాడు.

మద్యం తాగించి యువతిపై గ్యాంగ్‌రేప్

భూపాలపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి

గ్రిర్జాజీపేట, అక్టోబర్ 1: మద్యం తాగించి యువతిపై ఇద్దరు యువకులు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడ్డారు. గత నెల 15న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భూపాలపల్లి ప్రాంతానికి చెందిన యువతికి ఓ యువకుడు పరిచయం అయ్యాడు. ఇద్దరి మధ్య చాటింగ్, ఫోన్‌లో మాట్లాడుకోవడంతో పరిచయం మరింత బలపడింది. యువకుడు తన ఇద్దరు మిత్రులతో కలిసి గత నెల 15న యువతిని నమ్మించి కారులో వరంగల్ నగరానికి తీసుకొచ్చాడు. హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని యువతికి బీర్లు తాగించి ఇద్దరూ లైంగికదాడికి పాల్పడ్డారు. యువతి ఫిర్యాదు మేరకు మంగళవారం ఇంతెజార్‌గంజ్ పీఎస్‌లో కేసు నమోదైంది.

సాగర్ కాల్వలో ముగ్గురు గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు

రఘునాథపాలెం, అక్టోబర్ 1 : సాగర్ కాల్వలో పడి ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వీరిలో ఒకరి మృతదేహం లభించగా మిగతా ఇద్దరి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ ఘటన ఖమ్మం అర్బన్ పరిధి దానవాయిగూడెం వద్ద మంగళవారం చోటుచేసుకున్నది. భద్రాద్రి జిల్లా మణుగూరు ప్రాంతానికి చెందిన రోండ వెంకటేశ్వర్లు, చల్లా రమేశ్, ప్రసాద్, బండారు భరత్ సోమవారం ఖమ్మం వచ్చారు. మధ్యాహ్నం దానవాయిగూడెంలో మద్యం సేవించారు. తిరిగి వెళ్లే క్రమంలో దానవాయిగూడెం సాగర్ కెనాల్ వద్ద రాత్రి 10 గంటలకు ఆగారు. కెనాల్ పైకి వెళ్లాలని నిర్ణయించుకొన్నారు. రోండ వెంకటేశ్వర్లు ఆటోలోనే నిద్రించగా మిగిలిన ముగ్గురు సాగర్ కెనాల్ కట్టపైకి వెళ్లారు. అక్కడ స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. మంగళవారం ఉదయం ఆటోలో నిద్రించిన వెంకటేశ్వర్లు లేచి చూసేసరికి మిత్రులు రాకపోవడంతో కెనాల్ వైపు వెళ్లాడు. అక్కడ తన మిత్రుల దుస్తులు కాల్వ గట్టుపై కనిపించాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టగా బండారు భరత్(30) మృతదేహాన్ని గుర్తించారు. మరో ఇద్దరు ఆచూకీ కోసం రాత్రి వరకు గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది.

పేదల జోలికొస్తే ఊరుకోం:కూనంనేని

సుబేదారి, అక్టోబర్ 1: హైడ్రా పేరు తో హైదరాబాద్‌లో పేదల ఇండ్లను కూల్చితే ఊరుకునేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్నారు.

వృద్ధులను గౌరవించడం ముఖ్యం

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 1 : వృద్ధులను గౌరవించడం ముఖ్యమని, వారి కోసం ప్రభుత్వం అనేక చట్టాలను తెచ్చిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మంగళవారం జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వయోవృద్ధులకు వారం రోజులపాటు ఆటలు, పాటల పోటీలు నిర్వహించగా.. గెలుపొందిన వారికి బహుమతులు అందించి సన్మానించారు. రెండు నెలల్లో వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేస్తామని, అన్ని శాఖల్లో గౌరవించే విధంగా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంసీ లింగన్న, పెన్షన్ల సంఘం అధ్యక్షుడు విలాస్, కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, సీనియర్ పెన్షనర్లు బొజ్జ జనార్దన్, సీడీపీవో సరిత, ఏసీడీపీవో నాగలక్ష్మి, సౌమ్య పాల్గొన్నారు. అంతకుముందు నిర్మల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

వృద్ధులను సన్మానిస్తున్న స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 1 : దుర్గా నవరాత్రి, ఇతర ఉత్సవాలకు పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహించాలని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. నేర విచారణ సమర్థవంతంగా చేయడంతోపాటు కేసులను సత్వరమే పరిష్కరించేలా చూడాలన్నారు. దిలావర్‌పూర్‌లో జరిగే గంగనీళ్ల జాతర, బాసర దేవస్థానంలో జరిగే ఉత్సవాలకు పటిష్ట బందోబస్తును నిర్వహించి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. అనంతరం వినాయక ఉత్సవాల్లో పని చేసిన పోలీసులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అవినాశ్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన ఏఈవోలు

భీంపూర్, అక్టోబర్ 1 : కేంద్ర ప్రభుత్వం ఏఈవోలపై పనిభారం మోపుతున్న చర్యలకు నిరసనగా మంగళవారం భీంపూర్ మండలంలోని ఏఈవోలు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఈవో శంకర్ మాట్లాడుతూ.. ఇప్పటికే రుణమాఫీ, రైతు భరోసా, రైతులకు సూచనలతో పని ఒత్తిడి పెరిగిందన్నారు. దీనికితోడు ఏఈవోలను కేంద్రం ప్రతి చేనుకు వెళ్లి డిజిటల్ సర్వే చేయమనడంతో భారం పడుతుందన్నారు. ప్రతి క్లస్టర్‌లో వ్యవసాయ సహాయకుల నియామకం చేపడితే బాగుంటుందన్నారు. నిరసనలో కరంజి, అర్లి, ధనోరా, నిపాని, అందర్‌బంద్ ఉన్నారు.

యథేచ్ఛగా మొరం దందా

- గుట్టలను తవ్వేస్తున్న మాఫియా
- చెరువులను తలపించేలా తవ్వకాలు
- అధికారులకు బెదిరింపులు
- ఐదు రోజుల క్రితం మూడు టిప్పర్లు, జేసీబీ సీజ్
- తహసీల్దార్ కార్యాలయానికి తరలింపు కరువు
- టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని వినతి

ఐదు రోజుల క్రితం పట్టుకున్న మూడు టిప్పర్లు, ఒక జేసీబీ

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 1 : ఖానాపూర్ ప్రాంతంలో మొరం దందా జోరుగా సాగుతున్నది. అక్రమార్కులు లక్షలాది రూపాయలను ఆర్జిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఇటీవల ఖానాపూర్ పట్టణంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు మూడు టిప్పర్లు, ఒక జేసీబీని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాలు తహసీల్దార్ కార్యాలయానికి తీసుకురావాలని తహసీల్దార్ చెప్పినప్పటికీ అధికార పార్టీ నాయకులు మొరం మాఫియాకు అండగా నిలువడంతో వాహనాలు కార్యాలయానికి రాలేదు. కాగా.. రహదారుల నిర్మాణాలకు మొరం అవసరం కావడంతో కాంట్రాక్టర్లు యథేచ్ఛగా ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని భూగర్భ జలాలు, నీటి పారుదల శాఖల అనుమతితో తహసీల్దార్ ప్రత్యేక అనుమతులు మంజూరు చేస్తారు. ఇవన్నీ పట్టించుకోకుండానే కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుపుతున్నారు.

అధికారులపై ఒత్తిడి, బెదిరింపులు

ఖానాపూర్ పట్టణానికి చెందిన కొందరు అధికార పార్టీ నేతలు పట్టుకున్న వాహనాలను వదిలేయాలని తహసీల్దార్‌పై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. తహసీల్దార్ స్పందించకపోవడంతో అధికార పార్టీకి చెందిన జిల్లా నేత సదరు అధికారికి ఫోన్ చేసి పట్టుకున్న వాహనాలను వదిలిపెట్టేలా చేసిన ప్రయత్నాలు ఫలించలేదని ప్రచారం సాగుతోంది. ఇలా కఠినంగా వ్యవహరించడంతో కొందరు తహసీల్దార్ శివరాజ్‌కు ఫోన్ చేసి ఏసీబీ అధికారులకు పట్టిస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని విశ్వసనీయ సమాచారం. దీంతో తహసీల్దార్ వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని సమాచారం. కాగా.. ప్రకృతి వనరులను కాపాడేందుకు ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మొరం, ఇసుక తరలింపును అడ్డుకునేందుకు రెవెన్యూ, మైనింగ్, పోలీస్, ఇరిగేషన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సర్వే ల్యాండ్ రికార్డు శాఖల అధికారులతో ఒక టాస్క్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ శివరాజ్‌ను వివరణ కోరగా.. ఖానాపూర్ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ మొరం దందాపై ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు నివేదించానని తెలిపారు.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల నిరసన

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 1 : నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ.. మూడు నెలలుగా వేతనాలు అందించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. నెలనెల సరిగ్గా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందని అన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 1 : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఇన్‌చార్జి సెంటర్లకు అదనపు వేతనాలు చెల్లించాలని, సమ్మె కాలపు వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, పద్మకుమారి, శ్రీనివాసాచారి, రాణి, సాగరి తదితరులున్నారు.

నీటి సరఫరా మల్టీ పర్పస్ వర్కర్లదే బాధ్యత

ఇంద్రవెల్లి, అక్టోబర్1 : గ్రామాల్లో నీటి సరఫరాల చేసే బాధ్యత గ్రామపంచాయతీలో విధులు నిర్వహిస్తున్న మిషన్ భగీరథ శిక్షణ పొందిన మల్టీ పర్పస్ వర్కర్లదేనని డీఆర్డీవో సాయన్న అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకుల నాలుగు రోజులు నిర్వహించిన శిక్షణ తరగతులు ముగింపులో ఆయన పాల్గొని, శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఏఈ భానుకుమార్, గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బైంసాటౌన్, అక్టోబర్ 1 : పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం బైంసా, కుభీర్ మండలాల గ్రామ నీటి సహాయకులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సందీప్, ఏఈఈ అరుణ్‌కుమార్,తదితరులు పాల్గొన్నారు.

వివరాలను పక్కాగా సేకరించాలి

- ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి..
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి..
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

ఎదులాపురం, అక్టోబర్ 1 : ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలను పక్కాగా సేకరించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఫ్యామిలీ డిజిటల్ కార్డు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, రెండు పడక గదులు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈనెల 3వ తేదీ నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోని ఒక మున్సిపల్, గ్రామంలో కుటుంబాల వివరాలను ఇంటింటికీ తిరిగి సేకరించాలని, దీనికి నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని సూచించారు. ఆయా కుటుంబాల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలు తీసుకుని ఎంట్రీ చేయాలని ఆదేశించారు. ఈనెల 8వ తేదీ వరకు పూర్తి చేయాలని, 9వ తేదీ స్క్రూట్నీ, పదో తేదీన రిపోర్ట్ సబ్మిషన్ ఉంటుందని తెలిపారు. అనంతరం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఏఏ జిల్లాలో ఎన్ని ఉన్నాయి? ఎన్ని పూర్తి చేశారో అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ.. ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు తహసీల్దార్, ఎంపీడీవో, మున్సిపల్, ఎంపీవోల టీం అధికారులు ఉంటారని, వీరితోపాటు ఇద్దరు సిబ్బందితో సర్వే నిర్వహించాలని తెలిపారు. రెండు టీంలుగా ఏర్పడి ఈ సర్వే ఐదు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, మర్మట్ రెవెన్యూ డివిజనల్ అధికారి వినోద్ కుమార్ పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

మాట్లాడుతున్న ఎస్పీ జానకి షర్మిల

డీజే డబ్బుల విషయంలో గొడవ

ఎదులాపురం, అక్టోబర్ 1: డీజే డబ్బుల విషయంలో మాట మాటా పెరిగి ఇరు వర్గాల మధ్య గొడవకు దారితీసిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వ